# 12. కొండమీది బంగళా

బస్సు ఆగితే ఒకాయన కిందకు దిగాడు.

కండక్టరు, కొండమీద ఉన్నబంగళా చేతితో చూపించాడు.

బస్సు వెళ్లిపోయింది.

రోడ్డు నుంచి బంగళావరకు దీపాలున్నాయి.

రాత్రి పదిగంటలయింది.

నాలుగువేల అడుగుల ఎత్తులో ఉన్న ఆ చోట చల్లనిగాలి వీస్తున్నది.

ఉన్నది ఒక్క ఫర్లాంగు దూరమైనా, ఎక్కుడు రోడ్డుమీద నడిచేసరికి కేశవరావు బాగ అలసిపోయాడు. ముఖం చెమటతో నిండిపోయింది.

అతను ఈ శ్రమపడడనికి అవసరం లేదు. జీపు తిన్నగా బంగళాగేటు దగ్గరే ఆగుతుంది.

శృంగవరపుకోట వదిలిపెట్టి జీపుఘాటు రోడ్డుమీద పది కిలోమీటర్లు వెళ్లేసరికి వెనక ఆక్సిల్ విరిగిపోయి, ముందుకుకాని వెనుకకుకాని పోలేని స్థితిలో రోడ్డు మధ్యను ఆగిపోయింది. ఘాటు రోడ్డు ఎక్కుతున్నప్పుడు ఈ ప్రమదం జరిగింది. జీపు తక్కువ వేగంతో నడుస్తుండడం బట్టి ఎవరికీ దెబ్బలు తగలలేదు. ఇదేగాని తిరుగుదలలో జరిగితే ఘోరమైన ప్రమాదం సంభవించి ఉండేది.

జీపులో ముగ్గురే ఉన్నారు. డ్రైవరు, ప్యూను అధికారికేశవ రావు.

రాత్రిపూట జీపు బాగుపడే అవకాశంలేదు. మరో జీపు కోసం ఏర్పటు చేయడానికి రాత్రిపూట వీలుపడదు. అందుచేత ముగ్గురూ జీపును రోడ్డు పక్కకు చేర్చారు. డ్రైవరు, ప్యూను జీపును కనిపెట్టుకొని ఉండిపోయారు. కేశవరావు మాత్రం అరుకుపోయే బస్సెక్కి కొండమీది బంగళా దగ్గిర దిగిపోయాడు. ట్రావెల్ బాగ్ భుజానికి వేసుకొని బంగళావేపు కంకర రోడ్డుమీద నడిచాడు.

మారునాడు జరగవలసిన మీటింగుకి కేశవరావు పదిరోజులు ముందునుంచే ప్రయత్నాలు చేస్తున్నాడు. ఇద్దరు అసిస్టెంటు ఆఫీసర్లు, ఇద్దరు సీనియర్ ఇనస్పెక్టర్లు మరునాడు ఉదయానికి బంగళా చేరుకుంటారు. కాఫీ తోటల గురించి, గంధపు చెక్కల గురించి మీటింగు.

నిజానికి ఒకరోజులోనే మీటింగు ముగుస్తుంది. మరి రెండో రోజు అక్కడ ఉండడందేనికి?

పార్టీకి.

ఏ అరకులోనో మీటింగు పెట్టకుండా, కొండమీది బంగళాలో ఎందుకు పెట్టినట్లు?

ప్రశాంతంగా, హాయిగా రెండు రోజులు గడపాలని కేశవరావు ప్లాను వేశాడు. బదిలీ అయివచ్చిన నాలుగు నెలల నుండి అతనికి ఒక అరగంట కూడా తీరికలేకుండా పోయింది. అందుకే ఏకాంతంగా కాలం గడపడానికి అతనీ కొండమీది బంగళాలో మీటింగు పెట్టాడు.

ఆ బంగళాకు ప్రత్యేకత ఒకటుంది. 'హంస' అన్న పేరుకల వంటవాడొకడు అన్ని రకాల వంటలు చాలబాగా చేస్తాడు. అతనికి నాలుగురోజులు ముందుగా అందేటట్లు ఉత్తరం వ్రాస్తే అన్నీ సకాలానికి సిద్ధం చేస్తాడు.

కేశవరావు పది రోజులకిందే, తనకు, మీటింగుకి వస్తున్న వాళ్లకి బంగళాలో గదులు రిజర్వు చేయమని ఉత్తరం వ్రాశాడు. ప్రతిదినం తయారు చేయవలసిన వంటకాలు, అంటే మెనూ అన్నమాట, ఎంతమంది అతిథులు పార్టీలో పాల్గొంటారో, ఆ వివరాన్నీ హసంకు వ్రాశాడు.

బంగళావాచ్‌మన్ పేరు కొండన్న. తాను ఆదివారం రాత్రి జీపులో బంగళా చేరుకుంటున్నట్లు, తనకి వి.అయ్.పీ. సూటు ఉంచమని, స్నానానికి వేడినీళ్లు సిద్ధం చేయమని వ్రాశాడు. ఆ రాత్రికి బంగళాదుంపవేపుడు, పప్పుపులుసు, గడ్డపెరుగు చాలునన్నాడు.

ఈ ఆలోచనలలో పడి అతను బంగళా ఆవరణ గేటు తెరుచుకొని, ముందు హాలువేపు నడిచాడు. లోపల ఎలక్ట్రిక్ దీపాలు వెలుగుతున్నాయి. ముందు తలుపు ఎంతసేపు కొట్టినా ఎవరూ తియ్యలేదు. వెనుకనుంచి వెళ్లిచూస్తే పెద్దతాళం వేసిఉంది.

కేశవరావుకి మతిపోయినట్లయింది. అతని ఆఫీసు సూపరింటెండు నాలుగు సంపత్సరాల కింద కుటుంబాన్ని తీసుకొని వారం రోజులు బంగళాలో ఉండి రాజభోగాలు అనుభవించాడు. అతనే కేశవరావుకి అన్నివివరాలు చెప్పి నమ్మకంగా పంపించాడు.

ఇప్పుడేం చెయ్యడం?

బహుశా వాచ్‌మన్‌కి ఉత్తరం అంది ఉండకపోవచ్చు.

పెరటి భాగంలో కొద్ది దూరంలో ఔట్‌హౌస్ కనిపించింది. అందులో వాచ్‌మన్ ఉంటాడు. లోపల ప్రశాంతంగా దీపాలు వెలుగుతున్నాయి. తలుపుల అద్దాలలోంచి చూస్తే లోపల ఎవరో ఉన్నట్లు కనిపించింది. బైట తలుపుకి తాళంలేదు.

కేశవరవు తలుపు కొట్టాడు.

వెంటనే ఎవరూ వచ్చి తలుపు తియ్యలేదు.

మూడోసారికి తలుపు తెరచుకుంది.

లోపల ఒక యువతి తలుపు దగ్గిర నిలబడింది.

'నాపేరు కేశవరావు – నేను పెద్ద ఆఫీసరుని. రాత్రికి వస్తున్నానని, నాకు వి.అయ్.పి. సూటు సిద్ధంగా ఉంచమని అసిస్టెంటు ఇంజనీరుకి, వాచ్‌మన్ కొండన్నకు ఉత్తరాలు వ్రాశాను. బంగళా తలుపులు తెరచి, నాకాసూటు యివ్వవలసింది."

ఆమె కేశవరావుని కిందామీదా చూసింది.

"మాయజమాని బజారు సామాను తేడానికి అరకు వెళ్లినాడు. ఆడికే ఈ సంగతి తెలుస్తుంది. నాకు తెలీదు. ఎవరోచ్చి అడిగినా బంగళా తలుపులు తీయొద్దని ఆడు మరీమరీ సెప్పినాడు." అంది ఆమె.

"ఇది బాగుందే! అప్పుడే పదిన్నర దాటిపోయింది. నాకోసం భోజం కూడా సిద్ధం చేయమని వ్రాశాను."

'అవేవీ నాకు తెలీదు.'

'నేను చాలపెద్దదొరని. బంగళా తలుపులు తెరిచి నాకు గది చూపించు.' కేశవరావు కొంచెం గట్టిగా అడిగాడు.

'అపనేదీ నేను చెయ్యలేను.'

'అయితే నేనెక్కడుండాలి?'

'నాకు తెలీదు.'

'కొండన్న ఎప్పుడొస్తాడు?'

'రేపు పొద్దున్న తొమ్మిదికి.'

'అయితే రాత్రంతా నన్ను బయట కూర్చోమంటావా?'

'అది నీ యిష్టం.'

'అవుట్ హౌస్‌లో ఎవరుంటున్నారు?'

'ఇప్పుడు నేను, నాచంటోడు.'

లోపల నుంచి చంటిపిల్లడి ఏడుపు వినిపించింది.

ఆమె తలుపు ముయ్యకుండా, లోపలికి వెళ్లింది.

ఔట్‌హౌస్ మరేం కాదు – ఒకటే పెద్దగది – దానిలో కుడిచేతివేపో ఇనపమంచం, ఎడంచేతి వేపు మరొకటి ఉన్నయి. వాటిమీద కొత్త పరుపులు ఆమె చంటిపాప

కేశవరావు గుమ్మం దగ్గిర అలాగే నిలబడ్డాడు.

ఒక పనినిమిషాల తరువాత ఆ యువతి తిరిగి వచ్చింది.

'ఈ రాత్రి ఉండడానికి చోటు చూపించు. పొద్దున్న కొండన్న వస్తే, నేను బంగళా తలుపులు తెరిపించానని చెప్తాను.'

'చూడు! బంగళా తలుపులు ఎవరికీ తెరవొద్దని మా యజమాని మరీమరీ

చెప్పాడు.'

'అయితే మరేం చెయ్యడం?'

'నా యజమాని వట్టి అనుమానం పురుగు.'

'బయట బాగా చలిగా ఉంది, మంచు కురుస్తున్నది. ఈ రాత్రికి ఈ మంచం మీద పడుక్కోనివ్వు.'

ఆమె పదినిమిషాలు ఆలోచించింది.

'పాపం! అందరికీ యిడుమలొస్తాయి. బుద్ధిగా ఈ మంచంమీద పడుక్కో.'

ఆమె పక్కకు తప్పుకొని కేశవరావు లోపలికి రాడానికి చోటు యిచ్చింది.

అతను జోళ్లు విప్పి మంచం కింద ఉండాడు. చొక్కామడత పెట్టి ట్రావెలుబాగ్ కింద ఉంచాడు. తలగడ లేకపోతే, బాగ్‌మీదే తలుంచి పడుక్కుంటూ అన్నాడు.

'ఈ బంగళాలో వాచ్‌మన్‌కి కూడా ఫోమ్ పరుపులు, కొత్తమంచాలు ఉంటాయని తెలియదు.'

ఆ యువతి లోపల నుంచి తలుపు గడియపెట్టి తన మంచం దగ్గిరికి పోయింది.

'ఏం మనిషివయ్యా! ఈ బంగళాకి మరో రెండు పెద్దగదులు కట్టిస్తారట. అందుకోసం ముందుగా, ఈ మద్దే, ఈ మంచాలు, పరుపులు తెప్పించారు. వాటిని ఉంచడానికి సోటులేక మా మీద పారేశారు.'

'అదా సంగతి!'

కేశవరావు పడుక్కున్నాడేకాని కళ్లు మూతలు పడలేదు. కళ్ల ఎదురుగ నూరువాట్ల బల్బులు రెండు. చంటి పిల్లడున్నాడు. దీపాలు ఉండవలసినదే.

ఇక! అతనికి చెప్పలేనంత ఆకలిగా ఉంది.

సాయంకాలం శృంగవరపుకోటలో కాఫీ మాత్రం తాగాడు. ఎనిమిది గంటలకి బంగళా చేరుకుంటే, వేడి నీళ్ల స్నానం చేసి భోజనం ముగించి, తెచ్చుకున్న ఇంగ్లీషు నవల చదువుకుందామన్నాడు.

అతనికి చాల ఆకలిగా ఉంది.

'ఓ కొండన్న పెళ్లమా! ఆకలి జోరుగాఉంది. ఏదేనా తినడానికి కాని తాగడానికి కాని ఉందా?'

'ఇంట్లో సరుకులన్నీ నిండుకుంటే, నా జయమాని కొనితేడానికి అరుకు వెళ్లినాడు. అడొచ్చేదాకా ఏమీ దొరకదు.'

ఏమీ తోచలేదు అతనికి నిద్రరాలేదు. లేచి మంచం మీద కూర్చున్నాడు.

'నిద్దర రాడం నేదా?'। కొండన్న పెళ్లాం అడిగింది.

'ఆకలిగా ఉంటే ఎలా వస్తుంది?'

'కళ్లు మూసుకొని తొంగో - అదే వస్తుంది.'

'అతను కళ్లుమూసుకొని పడుకున్నాడు. కొండన్న అనుమానం పురుగు - వాడి పెళ్లాం. తాను ఒక గదిలో పడుక్కుంటే... అమ్మో! చంపుతాడు. కాని వాడి పెళ్లాం. ఉత్తమా యిల్లాలు - అలా - అలా - అతను నిద్రలోకి జారుకున్నాడు.

అతనికి తెలివి వచ్చేసరికి కొండమీదికి సాకిన ఎండ అతని ముఖంమీద పడుతోంది.

ఎవరో తట్టిలేపుతున్నారు.

ఎదురుగుండా నిలబడ్డ మనిషి అడుగుతున్నాడు.

'ఎవరయ్యా నువ్వు?'

కళ్లు నులుముకుంటూ కేశవరావులేచి అన్నాడు.

'నేను ఫలానా అధికారిని.'

'అయితే బయట అరుగుమీద పడుకున్నారేమిటి?'

కేశవరావు తన చుట్టూ చూశాడు - కళ్ల ఎదురుగా దీపాలు లేవు - ఆకాశం కొండలు - మంచాలు, ఫోము పరుపులు లేవు. ఔట్‌హౌస్ మాత్రం ఉంది. దాని గోడలు పడిపోయాయి.

కేశవరావు లేచి నిలబడ్డాడు. తలకింద ట్రావెల్‌బాగ్ దానికింద మడత పెట్టిన చొక్కా

'వాచ్‌మన్ రాలేదా?'

'నేనే వాచ్‌మన్‌ని - ఇప్పుడే వస్తున్నాను.'

'రాత్రి వాచ్‌మన్?'

'మరెవడూలేడు - నేనొక్కడిని పగలు పనిచేస్తాను. రాత్రి బంగళాబంద్!'

'హంస ఏమయాడు?'

'మూడు సంవత్సరాల కింద ఉద్యోగం మానేసి తనవూరు వెళ్లిపోయాడు.'

'వాచ్‌మన్ కొండన్న?'

'వాడు రెండు సంవత్సరాలయి విశాఖపట్నం జైలులో ఉన్నాడు.'

'దేనికి?'

'వాడికి అనుమాన మొచ్చి పెళ్లాన్ని. కొడుకుని చంపి పోలీసులకు లొంగిపోయాడు.'

కేశవరావు లేచి అరుగు పక్కనున్న జోళ్లు తొడుక్కున్నాడు. ట్రావెల్‌బాగ్ భుజానికి ఎత్తుకున్నాడు. వాచ్‌మన్‌కి ఏ సంగతి చెప్పకుండా బంగళాదాటి పోయాడు. దిగువకు పోతున్న రోడ్డుమీద అతనికో నీలి కాగితం కనిపించింది. అది అతను హంసకి కొండన్నకి వ్రాసిన ఉ

త్తరం. దానినతడు అందుకోడానికి వంగాడు. గాలికి అది ముందుకు పోయింది. దానిని వెంబడిస్తూ దిగువకు అతను నడిచాడు. అలానడుస్తూ బస్సు వచ్చేరోడ్డు చేరుకున్నాడు.

నీలికాగితం రోడ్డు దాటి అగాధంలోపడి పోయింది.

శృంగవరపుకోటపోతున్న బస్సు ఆగితే దానిలో కేశవరావు ఎక్కిపోయాడు.